దంచికొట్టిన వర్షం

జలదిగ్బంధంలో శివారు కాలనీలు ● ఇళ్లలోకి చేరిన వరదనీరు.. పొంగి పొర్లుతున్న డ్రైనేజీలు
● ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు ● నిలిచిన వాహనాల రాకపోకలు

నగర శివారులో ఆదివారం రాత్రి, సోమవారం కురిసిన భారీ వర్షానికి వాగులు ఉప్పొంగుతున్నాయి. వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఆయా పాంతాల్లోని ఇళ్లు, కాలనీలు నీట మునిగాయి. వరద ప్రవాహం పలు కల్వర్టులను ముంచెత్తింది. దీంతో పలు గ్రామాలకు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. రోడ్లు మూసివేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.


విజయవాడ జాతీయ ప్రధాన రహదారిపై చింతలకుంట వద్ద నిలిచిన వరదనీరు


మహాలక్ష్మీకాలనీలో ఇంటిలోకి చేరిన వరదనీరు


బీఎన్ రెడ్డినగర్ డివిజన్ స్నేహమయి నగర్‌లో వరదలో కొట్టుకపోతున్న బైక్‌ను పట్టుకుంటున్న కాలనీవాసులు

వనస్థలిపురం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ లోని గాంధీనగర్, స్నేహమాయినగర్, పీవీఆర్ కాలనీ, పద్మావతినగర్, మహాలక్ష్మీకాలనీ, అఖిలాండేశ్వరీ నగర్, మైల్‌స్టోన్, గాయత్రినగర్ ఫేజ్-1,2,3,4, భవానీ ఎంక్లేవ్, జక్కిడి రామస్వామి నగర్ కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. పై కాలనీల నుంచి వస్తున్న వరదనీరు శివారు కాలనీల్లోని ఇళ్లలోకి రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుమారు నాలుగేళ్ల తర్వాత హరిహరపురం కాలనీలోని కాప్రాయి చెరువు వరదనీటితో పూర్తి స్థాయిలో నిండింది. దిగువ ప్రాంతంలో ఉన్న మహాలక్ష్మీ కాలనీ, స్నేహమాయినగర్, పీవీఆర్ కాలనీ, పద్మావతి కాలనీ, అఖిలాండేశ్వరీ నగర్, భవానీ ఎన్‌క్లేవ్ కాలనీలోని ఇళ్లలోకి నీరు రావడంతో ఆదివారం రాత్రి కాలనీవాసులు అవస్థలు పడ్డారు. ఇంట్లో ఉన్న వస్తువులు తడిశాయని కాలనీ మహిళలు వాపోయారు. మహాలక్ష్మీ కాలనీకి చెందిన పులిజాల రాజు(31) తన ఇంట్లోకి వరదనీరు రావడంతో పక్కింట్లోకి వెళ్లే క్రమంలో కింద పడడంతో అతని చెయ్యి విరిగిపోవడంతో సమీపంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వరద తాకిడికి మహాలక్ష్మీ కాలనీలోని నాలుగు ఇళ్ల ప్రహరీలు కూలిపోయాయి. వరదనీరులో డ్రైనేజీనీరు కలవడంతో మురుగునీరు కాలనీల్లో ఏరులై ప్రవహించడంతో దుర్గంధంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. కాలనీవాసుల ఫిర్యాదులతో హైడ్రా డిజాస్టర్ బృందాలు రంగంలోకి దిగి వరదనీటి తరలింపు చర్యలు చేపడుతున్నారు.

● సోమవారం సాయంత్రం వనస్థలిపురంలో భారీ వర్షం కురవడంతో కాలనీవాసులు, వాహనదారులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వనస్థలిపురం డివిజన్‌లోని చింతలకుంట విజయవాడ జాతీయ రహదారిపై భారీగ వరదనీరు చేరడంతో అటుగా వెళ్లే వాహనదారులు, బాటసారులు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అదేవిధంగా ప్రశాంత్ నగర్, అభ్యుదయ నగర్, నాగార్జున కాలనీ, క్రిస్టియన్ కాలనీ, వెంకటరమణ కాలనీ, శక్తినగర్, జాంగీర్‌నగర్ తదితర కాలనీల్లో వరదనీరు పోటెత్తింది. విజయవాడ జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులు తమ సిబ్బందితో పర్యవేక్షిస్తున్నారు.

మూడు డైరెక్టర్ పదవులకు 9 మంది పోటీ

● ముగిసిన మదర్ డెయిరీ నామినేషన్ల ఉపసంహరణ

హయత్‌నగర్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మదర్ డెయిరీలోని మూడు డైరెక్టర్ పదవులకు జరగనున్న ఎన్నికలకు నామినేషన్ల ఉపసంహరణ గడువు సోమవారంతో ముగిసింది. జనరల్ మహిళా రిజర్వ్‌డ్ స్థానానికి నలుగురు అభ్యర్థులు, రెండు పురుషుల జనరల్ స్థానాలకు ఐదుగురు అభ్యర్థులు పోటీ పడుతున్నారని ఎన్నికల అధికారి వెంకట్‌రెడ్డి తెలిపారు. మహిళా రిజర్వ్‌డ్ స్థానానికి కర్నాటి జయశ్రీ, గంట్ల రాధిక, మోతె పూలమ్మ, నూధగాని విజయ పోటీ పడుతున్నారు. పురుషుల జనరల్ స్థానాలకు కుంచాల ప్రవీన్‌రెడ్డి, పెద్దిరెడ్డి భాస్కర్‌రెడ్డి, రచ్చ లక్ష్మీనరసింహారెడ్డి, శీలం వెంకటనరసింహారెడ్డి, సందిల భాస్కర్‌గౌడ్ పోటీ పడుతున్నట్లు ఎన్నికల అధికారి వెంకట్‌రెడ్డి తెలిపారు.

నాగోల్‌లో తాగునీటి పైప్‌లైన్ పనులు షురూ


తాగునీటి పైప్‌లైన్ పనులు ప్రారంభించిన కార్పొరేటర్ అరుణాసురేంద్రనాథ్ యాదవ్

మన్సూరాబాద్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నాగోల్ డివిజన్ హనుమాన్ నగర్‌కాలనీలోని రోడ్ నం. 13లో రూ.4.50లక్షల వ్యయంలో చేపట్టిన నూతన తాగునీటి పైప్ లైన్ పనులను కార్పొరేటర్ చింతల అరుణాసురేంద్రనాథ్ యాదవ్ సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ అర్చన, బీజేపీ నాయకులు ఐలయ్య, రావుల శ్రీనివాస్, కాలనీ అధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి పీఎస్ శర్మ, సభ్యులు ఉన్నారు.

సింగరేణి ఆఫీసర్స్ కాలనీలో ఓపెన్ జిమ్ ప్రారంభం


ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్వేతారెడ్డి

సైదాబాద్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆఫీసర్స్ కాలనీ పార్కులో జీహెచ్‌ఎంసీ నిధులతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ఐఎస్‌సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతా మధుకర్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు కేఆర్‌సీ రెడ్డి, సర్వేశ్వర్‌రావు, రాజశేఖర్ రెడ్డి, వెంకటరమణ, దేవేందర్, నాగేశ్వర్‌రావు, విజయ్‌కుమార్, రేణుక, అరుణ తదితరులు పాల్గొన్నారు.

'సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి'

చంపాపేట, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ ఎల్‌బీనగర్ సర్కిల్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను సోమవారం జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, హస్తినాపురం కార్పొరేటర్ సుజాతనాయక్ సోమవారం కలిశారు. ఈ సందర్భంగా దేవకమ్మతోట కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.64లక్షలు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. సీసీ రోడ్ల నిర్మాణం కోసం నిధుల మంజూరీకి జడ్సీ సుముఖత వ్యక్తం చేసినట్లు కార్పొరేటర్ తెలిపారు.

'ఆ రోడ్డును మేమే శుభ్రం చేయించాం'

సరూర్‌నగర్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలో క్రమం తప్పకుండా పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నామని మునిసిపల్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వి.యాదగిరి, మేనేజర్ శ్రీధర్‌రెడ్డి స్పష్టం చేశారు. 'బడంగ్‌పేట.. ఓ చెత్త కార్పొరేషన్' అంటూ ఆదివారం బీజేపీ నేతలు చేసిన ఆరోపణపై వారు స్పందించారు. సీఎస్ రెడ్డి కాలనీ రోడ్డులో ఆదివారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా తమ సిబ్బందితో తామే శుభ్రం చేయించామని, బీజేపీ నేతలు క్లీన్ చేశారనడం అవాస్తవమని వారు స్పష్టం చేశారు. తమ సిబ్బంది శుభ్రం చేసిన తర్వాత బీజేపీ నేతలు అక్కడ గ్రీన్ మెష్ ఏర్పాటు చేశారని వారు తెలిపారు. ప్రజలు తమ సిబ్బంది కష్టాన్ని అర్థం చేసుకుని పారిశుధ్య నిర్వహణలో తమ వంతు సహకారం అందించాలని వారు కోరారు.

'చెరువులోకి మురుగు చేరకుండా చర్యలు తీసుకోండి'

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ తారామతిపేట గ్రామంలోని చెరువులోకి మురుగు నీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం గ్రామానికి చెందిన పలువురు రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. వనస్థలిపురం ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న డ్రైనేజీ మురుగు నేరుగా గ్రామంలోని చెరువులోకి చేరుతుందని వివరించారు. దీంతో గ్రామంలో భూగర్భ జలాలు పూర్తిగా కలుషితం కావడంతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు.

జీఓ 99తో మాల, మాల ఉపకులాలకు అన్యాయం


ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న మాల సంఘాల జేఏసీ నాయకులు

ఎల్బీనగర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణపై జీఓ 99ని ప్రవేశపెట్టి ఎస్సీలోని 59 కులాల్లో 58కులాలకు తీవ్ర అన్యాయం చేస్తోందని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ మందాల భాస్కర్, గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్ బేరా బాలకిషన్ పేర్కొన్నారు. ఈ అన్యాయంపై శాసనసభలో చర్చించి న్యాయం జరిగేలా చూడాలని కోరుతూ సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సుధీర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ విషయమై శాసనసభలో చర్చించి న్యాయం చేసేందుకు తనవంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాల సంఘాల జేఏసీ నాయకులు కనివేట నర్సింగ్‌రావు, మాస శేఖర్, నాలుకల నర్సింగరావు, రెడ్డిమాల పెద్దకృష్ణ, జంగ్లీ కిషన్, సంతోష్, కిశోర్, కొప్పుల అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

79 మంది మద్యం ప్రియులకు కౌన్సెలింగ్

కొత్తపేట, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో వాహనాలు నడపడంతోనే కుటుంబాల్లో తీరని నష్టం చోటు చేసుకుంటోందని రాచకొండ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఇన్‌స్పెక్టర్ అర్జున్ రాచపుడి అన్నారు. రాచకొండ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన వారిలో 79 మంది మద్యం ప్రియులకు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో సోమవారం టీటీఐ లెక్చర్‌హాల్‌లో 5 విడతలుగా కౌన్సెలింగ్ నిర్వహించారు.

వివాహిత అనుమానాస్పద మృతి

మన్సూరాబాద్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదస్థితిలో ఓ వివాహిత మృతిచెందిన ఘటన నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్ స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్‌జానీ తెలిపిన వివరాల ప్రకారం... మహబూబాబాద్ జిల్లా రెడ్డాల గ్రామానికి చెందిన బోడ స్వరూప(35)కు అదే జిల్లా సోమ్లా తండాకు చెందిన బోడ రవితో 20ఏళ్ల క్రితం వివాహమైంది. ఈ ఇద్దరు దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కాగా, కొన్ని సంవత్సరాలుగా అదే గ్రామం సోమ్లాతండాకు చెందిన బానోతు అనిల్‌కుమార్(24)తో స్వరూపకు పరిచయం ఉంది. ఈ నేపథ్యంలోనే రెండురోజుల క్రితం స్వరూపకు మాయమాటలు చెప్పి నగరంలోని నాగోల్‌లో గల బ్లైండ్స్‌కాలనీకి అనిల్ రప్పించాడని రవి తెలిపాడు. అదేరోజు రాత్రి సుమారు 11.35గంటలకు స్వరూప చనిపోయిందని సమాచారం అందడంతో వెంటనే కుటుంబసభ్యులతో మృతురాలి భర్త రవి నాగోల్‌లోని ఘటనాస్థలానికి చేరుకుని చూడగా ఆమె బాత్‌రూమ్‌లో చీరతో ఉరేసుకుని కనిపించింది. తన భార్య మరణానికి బానోతు అనిల్‌కుమార్, అతడి తండ్రి బానోతు కిషన్, సోదరుడు బానోతు రెడ్యా కారణమని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రవి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు నాగోల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బొమ్మలగుడి ఉన్న ప్రాంతానికి చెందిన వ్యక్తి..

మన్సూరాబాద్: 'అదనపు కట్నం కోసం.. భార్య గొంతు కోశాడు' అనే శీర్షికతో ఈ నెల 15న 'ఆంధ్రజ్యోతి' హైదరాబాద్ జిల్లా పేజీలో ప్రచురితమైన వార్తలో నిందితుడు వేణుగోపాల్ బొమ్మలగుడికి చెందిన వాడిగా ప్రచురితమైంది. సదరు నిందితుడు రాజరాజేశ్వరీనగర్ కాలనీలోని బొమ్మలగుడి ఉన్న ప్రాంతానికి చెందిన వ్యక్తి అనే విషయాన్ని గుర్తించాలని పాఠకులకు విజ్ఞప్తి.

జలదిగ్బంధంలో బంజారాకాలనీ, రంగనాయకుల గుట్ట

హయత్‌నగర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌లో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాల్లో ఉన్న రంగనాయకులగుట్ట, బంజారాకాలనీ, లక్ష్మీనగర్ కాలనీ, పద్మావతికాలనీ, మునగనూర్‌లోని యాదాద్రినగర్ కాలనీ పూర్తిగా నీట మునిగాయి. వనస్థలిపురంలోని కాప్రాయి చెరువు, గుర్రంగూడ ఫారెస్టు, తుర్కయంజాల్ మాసబ్ చెరువు, హైకోర్టు కాలనీ, జాతీయ రహదారిపై నుంచి వచ్చిన వరదతో కుమ్మరికుంట, బాతుల చెరువులు నిండి అలుగు పారుతోంది. తుర్కయంజాల్ మాసబ్ చెరువు నుంచి ఇంజాపూర్ దిలావర్‌కాన్ చెరువుకు భారీగా వరద నీరు వస్తోంది. చెరువు నుంచి వస్తున్న వరద హయత్‌నగర్- మునగనూర్ కల్వర్టుకు చేరుకుని వరద ప్రవాహం భారీగా పెరిగి బంజారా కాలనీ, రంగనాయకులగుట్ట కాలనీని పూర్తిగా ముంచేసింది. దీంతో ప్రజలు కట్టుబట్టలతో ఇంట్లో నుంచి బయటకు వచ్చారు. ఇండ్ల చుట్టూ మూడు ఫీట్ల ఎత్తు వరకు నీరు చేరింది. హయత్‌నగర్ శ్మశానవాటిక వద్ద నిర్మించిన వరద కాలువపై నుంచి నీరు ప్రవహిస్తోంది. రంగనాయకులగుట్ట కాలనీ కింది ప్రాంతంలో ఉన్న ఇండ్లను వరద నీరు చుట్టుముట్టింది. పద్మావతికాలనీలో మూడు ఫీట్ల వరకు నీరు చేరి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.


ముంపు బాధితురాలిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

నీట మునిగిన కాలనీల్లో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పర్యటన

నీట మునిగిన బంజారాకాలనీ, హయత్‌నగర్- మునగనూర్ వంతెనను ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, హయత్‌నగర్ కార్పొరేటర్ నవ జీవన్‌రెడ్డి సందర్శించారు. పరిస్థితి తీవ్రంగా ఉండడంతో ఎమ్మెల్యే జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను పిలిపించారు. పరిస్థితిని చక్కదిద్దాలని అధికారులను ఆదేశించారు. వరద నీటి కాలువను మరింత విస్తరించాలని ఎమ్మెల్యే, కార్పొరేటర్ జోనల్ కమిషనర్‌కు సూచించారు.

వరదనీటి సమస్యలను పరిష్కరించాలి

● జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్


జెడ్సీకి వరదనీటి సమస్యలను వివరిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

వనస్థలిపురం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): బీఎన్ రెడ్డినగర్ డివిజన్‌లోని శివారు కాలనీలలో వరదనీటి సమస్య శాశ్వత పరిష్కారానికి సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఆదేశించారు. బీఎన్ రెడ్డినగర్ డివిజన్‌లో వరదనీరు చేరిన శివారు కాలనీల్లో సోమవారం జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డితో కలిసి పర్యటించారు. వరద బాధితులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వరదనీటి సమస్య పరిష్కారానికి నిధులు కేటాయించి, శాశ్వత పరిష్కారం చూపాలని కమిషనర్‌ను కోరారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం అశోక్, డీఈ దామోదర్ రెడ్డి, ఏఈ కార్తీక్, జలమండలి అధికారులు పాల్గొన్నారు.

కల్వర్టులను ముంచెత్తిన వరద

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని వాగుల్లో వరద ప్రవాహం పెరిగింది. ఆదివారం రాత్రి ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షానికి వరద నీరు పోటెత్తింది. దీంతో వాగుల్లో ప్రవాహం పెరిగి కల్వర్టులపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తోంది. పెద్దఅంబర్‌పేట-మునగనూర్ రోడ్డు, లష్కర్‌గూడ-అనాజ్‌పూర్, గుంతపల్లి-మజీద్‌పూర్, బాటసింగారం-మజీద్‌పూర్ రోడ్డులోని కల్వర్టుపై వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఆయా రోడ్డులో వాహనాల రాకపోకలు నిలిపివేశారు. అబ్దుల్లాపూర్‌మెట్ లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు ఆయా వరద ప్రవహిస్తున్న కల్వర్టుల వద్ద బారీకేడ్‌లను ఏర్పాటు చేసి వాహనాలను మళ్లించారు. బాటసింగారం వద్ద వాగులో నుంచి వెళ్లేందుకు యత్నించిన ద్విచక్ర వాహనదారుడు నీటిలో పడిపోయి రాళ్లను పట్టుకున్నాడు. గమనించిన స్థానికులు ఎక్స్‌కవేటర్ సాయంతో అతన్ని కాపాడారు.


బాటసింగారం- మజీద్‌పూర్ రోడ్డులో ఉధృతంగా ప్రవహిస్తున్న చిన్నఏరు


లష్కర్‌గూడ వద్ద కల్వర్టుపై వరద ప్రవాహంలో నుంచి బారులు తీరిన వాహనాలు


అల్మాస్‌గూడలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి తదితరులు

ప్రచారం కోసమే వంద రోజుల ప్రణాళిక

● ముంపునకు అధికారుల నిర్లక్ష్యమే కారణం

● మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

సరూర్‌నగర్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం కోసమే వంద రోజుల ప్రణాళిక ప్రవేశపెట్టి ఆర్భాటం చేసిందని, కనీసం నాలాలు కూడా శుభ్రం చేయలేకపోయారని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి ఆరోపించారు. చిన్నపాటి వానకే కాలనీలు, బస్తీలు ముంపునకు గురవడానికి నాలాల్లో మట్టి పేరుకుపోవడమే కారణమని ఆమె అన్నారు. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ, జయశంకర్‌నగర్ కాలనీల్లో ఇళ్లలోకి వరద నీరు వచ్చినట్టు తెలుసుకున్న సబితారెడ్డి.. సోమవారం ఆయా ప్రాంతాల్లో పర్యటించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మునిసిపల్ అధికారుల నిర్లక్ష్యమే ఈ దుస్థితికి కారణమని, నాలాలు, డ్రైనేజీ మ్యాన్ హోళ్లు శుభ్రం చేయాలని అధికారులకు తెలియదా? అని ప్రశ్నించారు. ముంపు బాధితులకు తాము అండగా ఉంటామని, ఇళ్లలోకి నీరు చేరకుండా అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఆమె కమిషనర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అల్మాస్‌గూడ మాజీ కార్పొరేటర్లు ఏనుగు రాంరెడ్డి, స్వప్నావెంకట్‌రెడ్డి, దీపికాశేఖర్‌రెడ్డి, లలితాకృష్ణ, కవితారాంరెడ్డి, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, కామేశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్రంగూడలో అందెల పర్యటన


గుర్రంగూడలో ముంపు కాలనీలో పర్యటిస్తున్న బీజేపీ నేత శ్రీరాములుయాదవ్

ఆదివారం కురిసిన వర్షానికి గుర్రంగూడలోని పలు కాలనీలు వరద ముంపునకు గురైనట్టు తెలుసుకున్న బీజేపీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ సోమవారం మాజీ కార్పొరేటర్లు దడిగ శంకర్, గడ్డం లక్ష్మారెడ్డితో కలిసి ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల్లో రోడ్ల నిర్మాణంలో నిబంధనలు పాటించకపోవడం, డ్రైనేజీ నిర్మాణం పద్ధతి ప్రకారం చేపట్టకపోవడం వల్లే ముంపు సమస్య ఉత్పన్నమవుతోందని అన్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి భవిష్యత్‌లో ముంపు సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అందెల డిమాండ్ చేశారు.

నాలా శుభ్రం చేయించిన కాంగ్రెస్ నేత బోయపల్లి


శ్రీసాయి కాలనీలో నాలా శుభ్రం చేయిస్తున్న రాఘవేందర్‌రెడ్డి

ఆదివారం కురిసిన భారీ వర్షానికి కాలనీల్లోకి వరద నీరు రావడంతో సోమవారం ఏఐసీసీ విచార్ విభాగ్ కోఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి అల్మాస్‌గూడలోని శ్రీసాయినగర్‌తో పాటు ఇతర కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా నాలాల్లో వ్యర్థాలు నిండి ఉండడం గమనించి మునిసిపల్ అధికారులతో మాట్లాడి ఎక్స్‌కవేటర్ తెప్పించి నాలాలు శుభ్రం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మునిసిపల్ అధికారులు నాలాలు, మ్యాన్ హోళ్లు, లోతట్టు ప్రాంతాల్లోని రోడ్లపై దృష్టి సారించి ముంపు సమస్య రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం


సైదాబాద్ మాత మైదాన్‌లో అమ్మవారిని దర్శించుకున్న బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్ రెడ్డి దంపతులు


కర్మన్‌ఘాట్‌లో శ్రీ సరస్వతిదేవి ఆలయంలో పూజలు చేస్తున్న ఆలయ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, ఈఓ లావణ్య తదితరులు


జీవనజ్యోతి సంఘంలో బాలాత్రిపుర సుందరి దేవికి ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి తదితరులు

అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు


బాలాత్రిపుర సుందరిగా దర్శనమిస్తున్న ఆర్కేపురంలోని ప్రత్యంగిరా పరమేశ్వరి దేవి


బాలాపూర్‌లోని శ్రీవేణుగోపాలస్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన దుర్గామాతను దర్శించుకున్న మాజీ మేయర్ పారిజాతానర్సింహారెడ్డి తదితరులు

ఎల్బీనగర్/దిల్‌సుఖ్‌నగర్ జోన్ బృందం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్, మలక్‌పేట, మహేశ్వరం నియోజకవర్గాల పరిధిలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పలు మండపాల్లో, అమ్మవార్ల ఆలయాల్లో దుర్గామాత ప్రతిమలను ప్రతిష్ఠించారు. అమ్మవారు బాలాత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శనం చేసుకునేందుకు మండపాల వద్ద భక్తులు బారులు తీరారు. మండపాల నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు.



మునగనూర్ రామానుజన్‌నగర్ కాలనీలోని పోచమ్మ ఆలయంలో బాలత్రిపుర సుందరిదేవి అవతారంలో ఉన్న అమ్మవారికి పూజలు చేస్తున్న సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గుత్తా వెంకట్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ హరి నాయక్, వైస్ చైర్మన్ లచ్చిరాం నాయక్ తదితరులు